దైవోపహతులు

శ్రీ కొండముది శ్రీరామచంద్రమూర్తి

జారిపోతున్న సాంధ్యకిరణాల్లో, ఆరుబయట మంచువాలో కూచుని వామనగాయ లాడుకుంటున్న వాళ్ళుముగ్గురూ—అల్లంతదూరంలో వీధి చివరగా, వెండిపొన్ను చేతికర్ర విలాసంగా త్రిప్పుకుంటూ, గాలికి మందమందంగా కదులుతున్న పట్టు కండువాను హుందాగా సవరించుకుంటూ, వస్తున్న శ్రీరాములుగారిని చూడగానే, ఒక్కసారిగా కళవళపడి, గాభరాగా చింతపిక్కలను కొంగుల్లో దాచేసుకుని, హడావుడిగా లేచినుంచుని, జరీపరికిణీలను కొంచెంగా ముంగాళ్ళమీదకు ఎత్తిపట్టుకుని, ప్రక్కలకు పారిపోయారు బెదురుకళ్ళ లేడిపిల్లల్లాగా.

వినిపిస్తూ వినిపిస్తూవున్న నవ్వులు హఠాత్తుగా ఆగిపోవడంతో, వసారాలో వోమూలగా కూచుని 'రామకోటి' రాసుకుంటూ నేగతాన్ని తల్చుకుంటూ కునికిపాట్లు పడుతున్న జానికమ్మ ఒక్కసారి తల యెత్తి మంచువాలోకి చూచి, అక్కడ ఆడుకుంటున్న ఆముగ్గురు ఆడపిల్లలూ కనిపించక పోవడంతో దిగ్భ్రమపడి, శ్రీరామపుస్తకాన్ని కళ్ళకద్దుకుని భద్రంగా అవతలపెట్టి, కళ్ళజోడు తీయకుండానే, బయటికి వచ్చి చుట్టుప్రక్కల తేరిపారజూచింది.

ఆయింటికి కొద్దిదూరంలోవున్న శివాలయానికి కొంచెం అవలగా. నీరువుండీ-లేకా ఎండిపోబోతున్న కోనేట్లోకి పడిపోవడానికి సిద్ధంగావున్నాడు ఎర్రగా వున్న సూర్యుడు. పాటిదిబ్బమీదినుంచి, ఎద్దుల నదిలిస్తూ, గడ్డిమోపులను ఓ బుజం మీదినుంచి ఇంకో బుజంమీదకు మార్చుకుంటూ, మధ్యమధ్యలో ప్రక్కనున్న సహభాగినులతో ముసిముసిగా నవ్వుకుంటూ సరదాగా నడుస్తూ వస్తున్నారు ఓ యిద్దరు పాలేళ్ళు.

ఆ ప్రక్కగా నంబివారి ఆడబడుచు ఒకామె, మోయలేక మోయలేక నీటిబిందె నొకదాన్ని చంకనెత్తుకుని, భారంగా అడుగులు వేస్తూ ఇంటివేపు నడిచి వెళ్లిపోతున్నది.

ఇంటిని సమీపిస్తూ సమీపిస్తూవున్న శ్రీరాములుగారు అపడుచును అలానిల్చునే, ఒక్కక్షణంసేపు చూచి గోముగా తలపంకించి ఇంటిని సమీపించారు.

తమ్ముడిరాకను చూచిన జానికమ్మ ఆలాగే కొద్దిసేపు అక్కడ నిల్చుని, హృదయంలోని బాధను కళ్లలో కనిపించకుండా చేయాలని వ్యర్థప్రయత్నంచేసి, ఓడిపోయి, తన్మూలంగా తల ప్రక్కకు తిప్పుకుని ఒక్కనిట్టూర్పు విడిచి, మౌనంగా ఇంట్లోకి వెళ్ళిపోయింది. ఎదురుగ్గా వచ్చిన పిల్లి పిల్లను ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని లోపలకు వచ్చిన శ్రీరాములు—వసారాదాటి వంటింట్లోకి వెళుతున్న అక్కగారిని చూసి, పలుకరించబోయి, కాని - పలుకరించలేక, యాంత్రికంగా హాల్లోవున్న మంచ మొకదాన్ని లాక్కుని కూచుని, స్థిమితంగా విశ్రాంతిపుచ్చుకుంటూ చుట్టముట్టించాడు.

ఉంగరాలుంగరాలుగా సుళ్లు తిరుగుతున్న పొగ, మసక చీకటిలో కరిగిపోతూ వింతవింత అందాలు సమకూర్చుకుంటున్నది. ఆ మేఘశకలాల మధ్యగా గోడకు వ్రేలాడుతున్న మేనకా, విశ్వామిత్రుడూ చూచాయగా కనిపిస్తున్నారు.

నిజమే! ఆమెను మెల్లిగా సందిట పొదువుకుని, విశ్వనాథవారి అరుంధతిలా, తెలియని తన్మయత్వంతో మూర్ధాన్నాఘ్రాణించి, బాహ్యాన్నవలోకింప చేయ

* ఆంధ్ర విశ్వకళాపరిషత్ ఆంధ్రభాషాసమితి నిర్వహించిన కథానికల పోటీలో(1956-57) ప్రథమ బహుమతినందిన కథ.

గలిగే సరికి ఎదురుగా ఈ మేనకా, ఈ విశ్వామిత్రుడే, ఇదేగదిలో, ఆనాడూ కన్పించారు.

కానీ అప్పటికీ, ఇప్పటికీ ఎంత భేదం!

బాల్యాన్ని వదిలి అప్పుడప్పుడే యౌవనాన్ని తొడుక్కుంటున్న వయసు...కనుపించీ, కనుపించకుండా వున్న వక్షస్థలం...అగరువత్తుల ధూపాలు! ...మల్లెపూల మాలలు!

కిటికీకి దగ్గరగా, తెల్లగా నవ్వుతున్న చంద్రుణ్ని చూస్తూ, వెన్నెట్లో కరిగిపోతున్నట్లుగా నిల్చున్నది లక్ష్మి. వెనగ్గా వెళ్ళి ఆమెచేతులను తనకు దగ్గరగా, తన హృదయానికి దగ్గరగా తీసుకున్నాడు. కానీ— బలంగా దగ్గరకు తీసుకోవడంలో పగిలిన ఆ రెండు గాజులూ...అపశకునమని బెదిరి లక్ష్మి దూరంగా తొలగి నిల్చున్నప్పుడు, తను నవ్వి, మళ్ళా ఆమెను గాఢంగా దగ్గరకు తీసుకున్నాడు. కానీ ఇప్పుడు తెలుస్తున్నది!

తను పిలిచాడు...కట్టుకున్న చీరలాగా వదలని సిగ్గు ఆమెను బాధించింది. ఆమె వంటినిండా పన్నీరు. ఆమె తలలో విరజాజులు.

తన లక్ష్మికి ఆ దృశ్యం—పులుకు చూపులతో, వేదికప్రక్కకు లేచిపోతూ, మునిశ్రేష్ఠుణ్ని నివారిస్తున్న మేనకను—చూపించాడు. 'ఇస్సీ' అనుకుంటూ అలవోకగా కన్నులరమూతలుగా వాల్చింది.

దూరంగా వున్న చంద్రుడెక్కడికో, మబ్బుల ప్రక్కకు, ఎందుకో, తొందర తొందరగా తప్పుకుంటున్నాడు, గదిబయట అంతవరకూ వినిపించిన గాజుల గలగలలూ, కోమలుల కింకిణీ స్వనాలూ వినిపించడం ఆగిపోయాయి. గది బయటగా, మెడా మెడా పెనవేసుకుంటూ, అన్యోన్యం పొగువు కుంటూగున్న మామిడిచెట్టుమీద కూర్చున్న పావురాల జత వొకటి లీలగా కన్పిస్తున్నది.

ఆ పావురాల జత కువకువలో, ఆ వలపుల వెల్లువలో, ఆ మల్లెపూల వాసనలో, ఆ ప్రకృతి సౌందర్యంలో, అప్పుడు తనూ లక్ష్మి వొకరిలో వొకరు ఐక్యమైనారు—తాత్కాలికమని తెలీక.

అక్కడ: అప్పుడు:

పైశాచిక శక్తులూ, పారమార్థిక చింతనలూ, కలగాపులగంగా కలిసిపోయినవి. కృత్రిమ సభ్యత దూరంగా తొలగిపోయింది. ఈ దేహానికి సంబంధించిన నరాలు ఆమెను తనదగ్గరకు రప్పించి తనను ఆమెకు బానిసనుచేసి, పీల్చి పిడించినవి.

అంతరాత్మ మరణించింది. దేహం నియంతలా నాట్యం చేసింది. తన కండ్లలోని ఆనందాన్ని ఆమె కండ్లలో నింపుకున్నది.

చివరకు—

ఏ కలతా లేని మనసుతో ప్రశాంతంగా, హాయిగా నిద్రబోయింది.

* * * *

ఇది జరిగి సరిగ్గా ఇప్పటికి ఎనిమిది సంవత్సరాలు. జీవితంలో ఎల్ల కాలం వసంతమే తొంగి చూస్తుందని భావించుకుంటూనే. తనకు తెలియకుండానే, శీతలాన్నికూడా ఆహ్వానించాడు. ఆ తరుపరి, ఎన్ని అవాంతరాలు, ఎన్ని వికృత పరిణామాలు జరిగిపోయినవి?

ఆలోచనలకు అంతరాయం కల్గించి, ఆరిపోయిన చుటను చివరిసారిగా పీల్చి అవతల పారేస్తూ లేచి కూచుని, కండువాను బుజంమీదకు వేసుకున్న శ్రీరాములు, వంటింట్లోనుంచి, జానికమ్మ దీపం పట్టుకురావడం చూచి, అప్రయత్నంగానే, గోడ మీదకు, మేనకా—విశ్వామిత్రుల పటం మీదకు దృష్టి నిగుడించాడు.

ఇంకా మేనక విశ్వామిత్రుణ్ని తిరస్కరిస్తూనే వున్నది.

విశ్వామిత్రుడు ప్రాధేయపడుతూనేవున్నాడు.
కానీ తనసంగతి?

అంతా వ్యతిరేకం!

తనలక్ష్మి తనను అనేకసార్లు రహస్యంగా ప్రాధేయపడింది. కన్నీరు కార్చింది. చివరకు తనను ఎల్లా చక్కదిద్దాలో తెలీక, తోచక, లాలించింది. ప్రేమలో పొరలాడించింది. కానీ తన అనుమానం సంగతి ఎవరికి చెప్పగలడు? నలుగురికీ చెప్పదగిన విషయములు కావు!

హాలులో ప్రేలాడుతూవున్న ఇనుపతీగకు లాంతరుతగిలించి, ఆ వెలుగునీడల్లో, కళాకాంతులు లేని తమ్ముడి వదనాన్ని చూచి జాలిపడి పలుకరించబోయి, మళ్ళా ఏంమాట్లాడలో విషయం తెలీక, గృహకార్యం నిమిత్తం వంటయింట్లోకి వెళ్ళిపోయింది జానికమ్మ.

గాలికి కొద్దిగా కదులుతున్న లాంతరు, నీడలను కని పెంచి పెద్దవాటినిచేస్తూ వాటిమీనాన వాటిని వదిలివేస్తున్నది. శ్రీరాములుగారి కాళ్లమీద లాంతరు వెలుగులు పడి, కట్టుకున్న బెంగాలీ గ్లాస్కో పంచె మరింత తెల్లగా కన్పిస్తున్నది. కానీ—మొహంమీద వున్నచీకటి తెలలాగానే అతని హృదయంకూడా నల్లని మచ్చలమూలంగా కలుషితమై, కలగుండువడి పోతున్నది. దారి తెలియడంలేదు...ఎక్కడికి తన బ్రతుకు తనను ఈడ్చుకుపోతున్నదో తనకే తెలీడం లేదు. జీవితానికి అర్థం ఇంతేనేమో!

లేచినుంచుని మళ్ళీ యాదాలాపంగా గోడ మీదకు చూశాడు. ఈసారి విశ్వామిత్రుడి పటం నీడల్లో మునిగిపోయి, ఆ ప్రక్క నేవున్న సీతాదేవి, నవ్వుతూ మంటల్లోనుండి బయటకు వస్తున్నది. భర్తచేత అను మానింపబడిన స్త్రీకి ఇదేనేమో పరీక్ష!

తను, తనలక్ష్మికిగూడా ఇదేపరీక్ష పెడితే? దైహికంగా కలుషితమైపోయిన ఆమె కనీసం మాన సికంగానైనా పరిశుద్ధురాలవుతుందేమో!

దొడ్లోవున్న కొబ్బరిచెట్ల మధ్యగావున్న చంద్రుడు, ఆనాటి తారను జ్ఞప్తికి తెచ్చుకుంటున్నాడు గామోసు! ఎర్రగా, కంది, వున్నాడు.

అవతలివారింట్లోనుండి ఎవరో, తనబిడ్డకు జోల పాట పాడడం లీలగా వినిపిస్తున్నది.

ఆకంఠం ఎంతమార్దవంగా వుంది! ఎన్ని ప్రేమ భావాలు ఆకంఠంలో జీరాడుతున్నాయో!

ఆ తల్లిపాట ఎంతో హాయిగా, ఉంది. అంతకన్నా ఎంతో హాయిగా, సంతృప్తిగా, కోటిసౌఖ్యాలనిచ్చేదిగా వున్నది, ఆ పిల్లవాడి ఏడుపు. జీవితం ఆతల్లీ బిడ్డల ప్రేమలోనే ఇమిడివుందేమో!

కళ్లుమూసుకుని, ఆత్మావలోకనం చేసుకొన డానికి యత్నిస్తూ, సప్తమస్థాయీ పంచమస్థాయీ కలిసివున్న ఆ స్వరాలను రెండింటినీ తన హృదయ వీణలో పలికించుకోవాలని బాధపడుతూ, కిటికీవద్దకు వచ్చి బయటకుచూస్తూ నిల్చుండి పొయ్యాడు శ్రీరాములు.

ఆనాడూ—

సరిగా తాను ఇలా గేనుంచుని చూశాడు. ఇప్ప టికీ తనకు బాగా జ్ఞాపకంవుంది.

ఎక్కడినుండో తీతువుపిట్ట వికృతంగా అరుస్తూ వుండంచూచి, తనకు హఠాత్తుగా మెళుకువవచ్చి, కలలబరువు నిండివున్న ఆ కళ్ళతోనే ప్రక్కకు, లక్ష్మి పడుకున్న ప్రక్కవైపుచూశాడు. కానీ, అక్కడ లక్ష్మిలేదు!

ఇంతరాత్రిపూట, ప్రక్కమీదనున్న రెండు నెలల పసిగుడ్డునైనా గమనించకుండా ఎక్కడికి వెళ్ళిందో? తనలో ఏదో పాడుభావం—

రాక్షసంగా వెయ్యిగొంతుకలతో అరుస్తున్న ఓ పాడుభావం, మెదలుతున్నది.

'అది' నిజంకాదనీ, తన భ్రమమాత్రమేననీ; సమాధానం చెప్పుకోవడానికి ప్రయత్నంచేసి విసిగి వేసారి—ఇదే కిటికీవద్దకువచ్చి నుంచుని, దొడ్లో ఓమూలగావున్న ఆ మల్లెపొదవైపు అనుకోకుండా చూశాడు.

చూడకుండా వున్నట్లైతే, హాలాహలం కడుపులో వున్నసంగతి తెలీకుండానే, అందరితో నవ్వుతూ మాట్లాడి వుండేవాడేనేమో! కానీ, విధిచేతిలో కీలు బొమ్మలం.

ఏవో నీడలురెండు, ఒకదానిలోఒకటి ఆత్రు తగా కలిసిపోతూ, మల్లెపూలవాసనలను తమలో నింపు కుంటున్నాయి.

ఆసమయంలో తన కెంత కోపంవచ్చింది? కళ్ళు రక్తపూరితాలయినాయేమో ననపించింది.

అంగాంగం వణకిపోయింది. ఏదో తెలియని చైత న్యం, ఆవేశం, కోపం, భూతాల్లాతనను ఆవరించాయి. ఆ పిచ్చిలోనే వెళ్ళి వారిద్దరి గొంతూ పిసికి చంపేదా మనుకున్నాడు.

కానీ - యథార్థాన్ని పరికించినమీదట తన కుటుంబం అల్లరికావడం తప్ప ఏముంది? దాని మూలంగా తను సాధించ గలిగేది? అప్పటి తనశాంతం ఇప్పటికీ తన కాశ్చర్యం కల్గిస్తున్నది! అట్లా తను ఆలో చిస్తూ పరధ్యానంలో నిల్చుని వుండగానే, వెనక పాటుగా లక్ష్మి రానే వచ్చింది. తను వెనుకకు తిరిగి చూశాడు.

చీర కుచ్చెళ్ళు ఎడమచేత్తో పట్టుకుని, కుడిచేత్తో ముంగురులను సవరించుకుంటూ "ఏమిటండీ-ఆలోచిస్తు

న్నారు" అన్నది ఎంతో సుతిమెత్తనగా. ఇంకొక సమయంలో అయితే తను ఎంతో ఆనందం పడిపోయేవాడు. ఆమె నునుకపోలాల మీద చిన్న ఛురితాన్నొక దాన్నంటించేవాడు. కానీ, అప్పుడు మాత్రం గంభీరంగా 'ఏమిటే?' అన్నట్లుగా ఆమె వేపు తిరిగి, ఆమె కళ్లల్లో ఏదో అన్వేషిస్తున్నట్లుగా, ఆమె మొహంలో మొహంపెట్టి "ఊఁ!" అంటూ భ్రూయుగ్మాన్ని కుంచించాడు.

దానికే లక్ష్మి ఎంతగానో భయపడ్డది! గభాలున, ఒక అడుగు వెనకకు వేసింది. 'ఏమిటండీ'? అంటూ సన్నగా మూలిగి, రెండు నెలల ఆపసిగుడ్డువైపు చూస్తూ దీనంగా నిల్చుండిపోయింది. నిడుదలై, సోగలైన ఆ కాటుక కండ్లు తన నప్పుడు ఆకర్షించలేదు.

మహర్షులు తమ తపస్సును ధారపోసినా చూడలేని ఆ తనూలావణ్యం తన నప్పుడు ముగ్ధుణ్ని చేయలేదు.

మల్లెపూలకన్న మిన్నయైన ఆమె సౌందర్యం తననప్పుడు కరిగించలేదు.

అంతే! ఒకచూపు, ఒక నిద్ర, ఒక భోజనంగా వున్నవారు రెండుగా విడిపోయారు. రెండు నెలల పసిగుడ్డుతో సహా లక్ష్మికి, వేరుకాపరం ఏర్పాటు చేయించాడు. ఇందులో తన తప్పేముంది? లోకం తన నెందుకు ఆడిపోసుకోవాలి?

ఎందుకు ఆడిపోసుకుంటున్నదో అర్థంగాక, ఆలోచనలతో తనను తనే హింసించుకోలేక, అక్కగారితో వెళ్తున్నాననైనా చెప్పకుండా. విసురుగా బయటికి వచ్చి, విసవిసా నంబివారి ఆడబడుచు ఇంటివేపు నడక సాగించాడు శ్రీరాములు.

*　　　*　　　*

బియ్యం కడిగి గిన్నెలో పోసుకుని, ఆపూటకు తమ్ముడిని అక్కడ భోజనం చేయమని చెప్పటానికని హాల్లోకి వచ్చిన జానికమ్మ; శ్రీరాములు అక్కడ లేకపోవడం చూచి. ఆశ్చర్యపడి, వాకిట్లోకి వచ్చింది, అక్కడేమైనా, వున్నాడేమో నని.

పిండారబోసినట్లున్న ఆ వెన్నెట్లో శివాలయం దాటి, ప్రక్క వీధిలోకి వెళుతున్న ఓవ్యక్తిని చూచి, తమ్ముడేనని నిర్ధారణచేసుకుని, అతని జీవితాన్ని సరిదిద్దలేని తన పెద్దరికానికి తనకు తానుతిట్టుకుంటూ, గుమ్మానికి చేరగిలబడి, శూన్యంగా పరిసరాలను పరికించింది జానికమ్మ. తన బ్రతుకు సరేసరి! తమ్ముడి బ్రతుకు మాత్రం? నిక్షేపంగా కళకళలాడుతూవున్న భార్యతో కాపురం చేయవలసిన వాడు. బంగారపు బొమ్మలాంటివాడు. ఏవేవో అనుమానాలు మనసులో పెట్టుకున్నాడు. అవి బయటకు చెప్పడు, ఏమిటో, ఎండిపోతున్న చెట్టులాగా నానాటికీ కృశిస్తున్నాడే కాని, జీవితాన్ని సరిదిద్దుకోవాలన్న ఆలోచనే లేదు.

తమ్ముడిని గూర్చి తలపోస్తున్న సమయంలో ఆమె కళ్ళు అర్ద్రాలయినవి. జన్మాంతర సంస్కారం మూలంగా హృదయంలో ఏర్పడిన సున్నితమైన సంబంధం, ఎక్కడో అకస్మాత్తుగా తేలిపోయి నట్లైంది.

నిజమే! పది సంవత్సరాల క్రితంవరకూ తనకూ ఓసంసారం అంటూవున్నది. తనూ పిల్లా-జెల్లా కలిగి ఆనందం అనుభవిస్తాననుకొన్నది. వారిమూలంగా తన జన్మ తరిస్తుందనుకున్నది. కానీ ఆరాత్రి తర్వాత—

ఆ రాత్రి నెల్లా మర్చిపోవడం?

గులాబీపూలు తలలో ముడుచుకొంటూండగానే సుశిపన్నీరుజల్లినందువలన రవికఅంతా తడిసిపోయింది. వచ్చేసువాసన విపరీతంగావుంది. ఏమీ తోచక, తలుపు దగ్గరగా తను నిలబడి తలదించుకునే వారివేపు చూసీ చూడకుండా చూసింది. ఆయన మాట్లాడేభాష మనసులో మెదుల్తున్నది కానీ మాటల్లోరాదు. ఆయన పిలిచారు. తనేమని సమాధానం చెప్పిందో! ఎదురుగా వచ్చి, తనచేతులను వారిచేతుల్లోకి తీసుకుని...ఏమిటో ఆ ఆనందం! కలలు తొలగిపోయినవి. ఆ ఆనందం నిజమైనదని తెలుసు. తనకళ్ళు అరమూతలుగా వాలివున్నవి. వారి నల్లనిజుట్టులో మూసుకుపోతున్న తన కళ్ళను పూర్తిగా తెఱచి, వారి స్వరూపాన్ని తనలో చిత్రించుకోవాలని తన ప్రయత్నం. అనుభూతి, తనకోర్కెలకు సమాధానమైంది. ఆ దివ్యక్షణాలు శాశ్వతంకావాలనుకున్నది. ఆ రాత్రి తెల్లవారకూడదనుకున్నది. ఆ సుఖం దూరమవకూడదనుకున్నది: కలలకు ఇంతటి పరిపూర్ణమైన సహజత్వం చవిచూచాక, అది స్థిరమైపోవాలని ఆశించింది.

కానీ, తనకంత అదృష్టమా?

తను కట్టినచీర ఇంకా మాసిపోనేలేదు. మూడు రోజుల మధుపర్కాలభారం ఇంకా తీరనేలేదు.

పట్టణానికి ప్రయాణంకావడం, ఆప్రయాణం లోనే వారు విషజ్వరంవాతపడి, కన్నుమూయడం, అన్నీ అయిపోయాయి. జీవితం అంటే ఇంతే నేమో!

తనకిక మిగిలింది ఈ తమ్ముడు మాత్రమే. తన నొసటివ్రాత బాగులేక తను బాధపడుతుంటే అమర్చిన సౌఖ్యాన్ని ఆనందించలేక వాడు బాధపడుతున్నాడు. పిచ్చివాడు.

ఆలోచనల పరధ్యానంలో ప్రకృతాన్ని మఱచి గతాన్ని తలపోస్తున్న జానికమ్మ, ప్రక్కయింటివారి పసిపాప తనవద్దకు పరుగెత్తుకురావడం గమనించనే లేదు.

ఆయాసాన్ని మూటగట్టుకువచ్చిన ఆ పసిపాప, జానికమ్మకు దగ్గరసావెళ్ళి, ఆమెచేయి పట్టుకులాగి, ఆమెను తన వేపుకు తిప్పుకుని "లక్ష్మిపిన్ని నిన్ను అవసరంగా రమ్మన్నదత్తా" అనిచెప్పి, జవాబుకోసం నిరీక్షించకుండా మళ్లీ దూసుకుపోయింది.

పోతున్న జలజను చూసి, చెప్పినమాటను జ్ఞాపకానికి తెచ్చుకోటానికి ప్రయత్నించి 'అవసరం' అన్న మాటను స్ఫురణకు తెచ్చుకుని, బెంబేలుపడి, తలుపు దగ్గరకు వేయడం మర్చిపోయి, ముందుకు రెండడుగులు వేసి, మళ్ళీ వెనుకకువచ్చి, అన్నితలుపులూ భద్రంగా వేసి, తడబడుతున్న అడుగులతో లక్ష్మిఇంటి వేపుగా నడిచింది జానికమ్మ.

దారిలో, ఇంటికి అంతంత్రిప్పాట, నీళ్ళ కావళ్ళు మోసుకువస్తున్న ఇద్దరుముగ్గురు పల్లెపిల్లలు ఆమెనుచూసి, తమలోతాము నవ్వుకుని, దూరంగా వెళ్ళిపొయ్యారు. కానీ ఆమె వారిని గమనించక తల వొంచుకు నడుస్తూనేవుంది.

దారిలో పడుకున్న ఓనల్లకుక్క, నిలువెత్తు రూపమొకటి తనమీద అడుగు వేయబోవడం చూచి, భయపడి, దూరంగా తొలగి, మొరగడం ప్రారంభించింది.

అయినా ఈశబ్దాలేమీ జానికమ్మకు విన్పించినట్లు లేదు.

* * *

గుమ్మంలోకి వచ్చిన ఆడబిడ్డనుచూసి, అసహాయత, ఆదరణా కలిసిన స్వరంతో ఎల్లాగో స్వాగతం చెప్పి, గుడ్లనీరు గుడ్లకుక్కకుంటూనే, ఆమెను తీసుకుని లోపలికి నడిచింది లక్ష్మి. బ్రతకలేక బ్రతుకుతున్న ఆయింటివారిలాగానే గుడ్డిదీపమొకటి ఎగశ్వాస పీల్చుకుంటూ అక్కడ వెలుగుతున్నది. ఆ వెలుగునీడల మధ్య ఓ పసిపిల్లవాడి స్వరం 'నాన్నా' అంటూ కలవరిస్తూ మాట స్ఫుటంగారాక అణగారిపోతున్నది.

ఆపసివాడి వదనంలో కళాకాంతులు లేవు! వాడిన తోటకూరకాడ నయం అతనికన్నా! రాలిపోతున్న నక్షత్రాలకాంతిలాగా అతనికళ్లల్లో మిణుకు మిణుకు మంటున్న తేజస్సు...ఎముకలు బయటికి వచ్చిన ఆ చెక్కిళ్లు...తైలసంస్కారం లేని ఆ జుట్టు...చాలీచాలనందువల్ల చిరిగిపోయిన లాగు. మండుతున్న చితిలాగా వున్న ఆ మాతృహృదయంలోని క్షోభను జానికమ్మ అర్థం చేసుకున్నది. బేలగా వున్న జానికమ్మ హృదయంలోని ఆప్యాయత, కరుణా లక్ష్మికి తెలుసు. జానికమ్మ ఆ పిల్లవాడిదగ్గరకు వెళ్ళింది. అతడి ప్రక్కన కూర్చున్నది. అతని చేతులను తన చేతుల్లోకి తీసుకున్నది. "బాబూ!" అంటూ ప్రేమగా, జాలిగా, అతని కన్నీరును తన కొంగుతో తుడిచింది.

వేటూరి—

సుందరశాస్త్రిగారి

సువర్ణసుందర రసము

సర్వమేహములకుసంజీవి.

గుణము ప్రత్యేకము

అనుభవసిద్ధము. ఇంజెక్షన్లు అవసరం లేదు. ఎటువంటి నవామేహాలనైనా కుదుర్చును.

50 మాత్రలు రు. 5.

ఆర్షరసాయనశాల, ముక్త్యాల.

కానీ, ఆపిల్లవాడు జానికమ్మను చూసి గుర్తించనైనా గుర్తించలేదు. అయోమయంగా పిచ్చిచూపులు చూస్తూ "నాన్నా!" అంటూ అదేపనిగా కలవరిస్తూ, ఈ ప్రపంచపు మనుగడనుండి విముక్తి పొందడానికి ప్రయత్నిస్తున్నాడు.

ఆ పసిపిల్లవాడి హృదయం ఇంతగా ఎందుకు గాయపడిందో జానికమ్మకు తెలీలేదు. ఆమె నిస్సహాయంగా లక్ష్మి దగ్గరకు వచ్చి "జరిగిందేమిటి తల్లీ?" అని ఆమెను జాలిగాచూస్తూ ప్రశ్నించింది.

లక్ష్మిమాత్రం ఏమని చెప్పగలదు?

ఆ క్రిందటిరాత్రి 'నాన్నా' అంటూ దగ్గరకు చేరిన ఆ పసివాణ్ని, పురుగును విదిలించినట్లుగా విదిలించి, గొడ్డును బాదినట్లుగా బాదిన ఆ తండ్రి మూర్ఖ్యాన్ని ఏమని చెప్పగలదు? తల యెత్తకుండానే, "బెంగపడ్డాడు!" అని మాత్రం జవాబుచెప్పి, తన బేలతనం బయట పడుతుందేమోనని చీర చెంగులో మొహం దాచుకుంది.

జానికమ్మకు తెలుసు లక్ష్మి హృదయం యెంత సున్నితమో!

తగ్గిపోబోతున్న దీపాన్ని పెద్దది చేయటానికని దగ్గరకు వెళ్ళిన జానికమ్మ, ఆ వెలుగులో పిల్లవాడికి శోష రావడంచూచి, ఆదుర్దాతో "పంచ్లరసమయినా పిల్లవాడి కిచ్చావా?" అంటూ లక్ష్మి దగ్గరకు వచ్చింది.

లక్ష్మి జవాబు చెప్పలేదు. తలయెత్తి మాత్రము చూచింది.

ఆమె కండ్లలో రెండు కన్నీటిబిందువులు.

జానికమ్మ హడావుడిగా వంట యింట్లోకి వెళ్ళింది. ఆమెనుచూసి పొయ్యిలో పడుకుని విశ్రాంతి తీసుకుంటున్న తెల్లపిల్లి ఒకటి దూరంగా తొలగిపోయింది.

జానికమ్మ మౌనంగా మళ్లీ లక్ష్మిదగ్గరకు తిరిగి వచ్చింది. ఏదోచెప్పబోయింది. కానీ స్వప్నకంఠంతో లక్ష్మి మాటాడుతుండడం చూచి అప్రతిహతయై అలాగే నిల్చుండిపోయింది.

"వారం రోజులనుండి ఇంట్లో అన్నీ నిండుకున్నాయి. అయినా ఎలాగో గడిచిపోయింది. ఈరోజు ప్రొద్దున బాబు ద్రాక్షపళ్లు కావాలని ఒకటే గొడవ. ఎక్కడనుంచి తెచ్చిపెట్టను? జీవచ్ఛవాల్లాగా కాలం గడుపుతున్నాం. ఇదీ మా జీవితం."

జానికమ్మకు సమాధానం ఏమనిచెప్పాలో తోచలేదు. ఏదో ఓదార్పుగా మాట్లాడాలని ప్రయత్నిస్తున్న తరుణంలో, మళ్లీ లక్ష్మి అందుకున్నది.

"మీ యింటినుండి తెచ్చుకో లేదేమని నువ్వడగ వచ్చు. ఎంతకాలమని ఈలా ఇతరులను ఆశ్రయించి కాలం గడపడం? కట్టుకున్నవారికే బరువైన మా యిద్దరి జీవితం, ఉన్న–" అర్ధోక్తిలోనే అందుకుంటూ "పిచ్చిదానా! నేను నీకు పరాయిదాన్నా?" అని మాత్రం పలికి "ఉండు ఇప్పుడే వస్తాను" అంటూ బయటకు వెళ్ళబోయింది జానికమ్మ.

బయలుదేరబోతున్న జానికమ్మను చూసి — ప్రాధేయ పూర్వకంగా "ఒక్కక్షణం ఇక్కడవుండు జానకీ, నేను వెళ్లి వారిని పిల్చుకువస్తాను" అంటూ లక్ష్మి బయలుదేర బోయింది.

"నువ్వా? నువ్వు!" జానికమ్మ ఆశ్చర్యానికి అంతులేదు.

"అవును. వారెక్కడ వుంటారో, ఉన్నారో నాకు తెలుసు. పసివాడికోసం వారి కాళ్ళమీద పడతాను. నా హృదయంలో చిచ్చు పెట్టవద్దని బ్రతిమలాడుకుంటాను," అంటూ లక్ష్మి, జానికమ్మ నుండి జవాబుకోసమైనా నిరీక్షించకుండా, వెన్నెలపోయి చీకటి క్రమ్ముకుంటున్న ఆ సమయంలో బయటకు అడుగుపెట్టింది.

జానికమ్మకు ఇదంతా అగమ్యంగావుంది. "ఎందుకని లక్ష్మి ఇంత సాహసం చేస్తున్నది?" ఈ ప్రశ్నకు ఆమెలో సమాధానం లేదు.

అగమ్యంగా, పిచ్చిదానిలాగా ఆమె ఆపిల్లవాడి వేపు చూసింది. ఆ పసివాడు మన లోకం లేకుండా పడివున్నాడు.

దీపాన్ని పెద్దది చేయబోయింది. అది మరింతగా మరణాన్ని సమీపిస్తున్నది. ఏం చేయటానికి తోచక, ఆమె గుమ్మంలోకి వచ్చి, బయటకు తొంగిచూచింది. నిర్మానుష్యంగా వున్న వీధిలో, మూరుక్రింద నీడల్లో, కొందరు పిచ్చివాళ్లు, దైవోపహతులు, బైరాగి తత్వములు పాడుకుంటూ వెకిలిగా నవ్వుకుంటున్నారు.